మిత్రులు సి.ఆర్.ఆనందరావులు అనారోగ్యంతోనే మరణించారు. మా.వి.వే. వ్యవస్థాపక సభ్యుడు, రంగారెడ్డి జిల్లా మా.వి.వే. ఉపాధ్యక్షుడు బి.చంద్రశేఖర్ 15-11-07న హఠాత్తుగా అనారోగ్యంతో మరణించి తీరని ఆవేదన మిగిల్చారు. ఇటువంటి ఉద్యమ మిత్రుల్ని కోల్పోయి రాష్ట్రంలోని ఆయా భావవిప్లవ ఉద్యమాలు తీవ్రంగా నష్టపోయాయి. ఆ నష్టాన్ని మా.వి.వే. తనకు కలిగిన నష్టంగా భావిస్తూ వారందరికీ ఈ సభాముఖంగా నివాళులర్పిస్తోంది.

## కార్యవర్గ సమావేశాలు

ఈ మూడేళ్ళ కాలంలో మా.వి.వే.రాష్ట్ర కార్యవర్గం క్రింద పేర్కొన్న రోజుల్లో సమావేశం అయింది.

| | | |
|---|---|---|
| 6-02-05 | 11-1-06 | 9-01-07 |
| 27-02-05 | 16-07-06 | 10-06-07 |
| 9-10-05 | 11-11-06 | 11-11-07 |

వివిధ అంశాలను చర్చించి, తీసుకున్న నిర్ణయాలను, కార్యక్రమాలను మొత్తం 17 సర్క్యులర్స్ ద్వారా కార్యవర్గ సభ్యులకు తెలియపర్చింది. జిల్లాల కార్యవర్గ సమావేశాలకు రాష్ట్రనాయకులు వెళ్ళి తగిన విధంగా కార్యకర్తలకు సూచనలిచ్చారు.

## నెరవేరని ఆశలు

మా.వి.వే.ఈ మూడేళ్ళలో నెరవేర్చుకోలేని అంశాలు కూడా కొన్ని వున్నాయి. కార్యకర్తల్ని, జిల్లా కమిటీల్ని మానవవాదంలో సుశిక్షితుల్ని చేయలేకపోయింది. ఉద్యమ అభిరుచి వారిలో వున్నా, ఆశయాల ఔన్నత్యపు 'రుచి' వారికి పూర్తిగా తెలియలేదు. బాధ్యతలకు కట్టుబడి, సంస్థ పట్ల తగినంత ఇష్టంతో వ్యవహరించని వారు ఇంకా కొందరున్నారు. వస్తువ్యామోహం, ఉద్యమస్ఫృహను నీరుగార్చే వాటిపై లాలసత వారిలో వుండడం అందుక్కారణం. స్త్రీలు ఇంకా ఎక్కువ సంఖ్యలో సంఘంలో భాగస్వామ్యం కావలసివుంది. నేటి యువతరాన్ని మానవవాద భావాలకు ఆకర్షితుల్ని చేసి మా.వి.వే. కార్యక్రమాల్లో నిమగ్నుల్ని చేయాల్ని వుంది. భావవిప్లవోద్యమాల్లో వున్న కుటుంబాలన్నీ తమ పిల్లల్ని తమ భావాలకు వారసులుగా నిలుపుకోవాలి. అలా కాపడానికి తగిన కార్యక్రమాలు మా.వి.వే. చేపట్టవలసి వుంది.

ఇక వనరులపరంగా చూస్తే మా.వి.వే. చాలా పేదది. ఆర్థిక వనరులు చాలా తక్కువ. ఉద్యమానికి సమయాన్ని ఎక్కువగా ఇవ్వగల కార్యకర్తల్ని ఇంకా పెంచుకోవలసి వుంది. రాష్ట్ర కార్యాలయాన్ని ప్రత్యేకంగా ఏర్పరుచుకోవల్సి వుంది. ఇంటర్నెట్, ఫాక్స్ వంటి సౌకర్యాలను కల్పించుకోవల్సి వుంది. మిగిలిన జిల్లాలకు మానవవాదాన్ని విస్తరింపచేయాల్సి వుంది. వచ్చే మూడేళ్ళలో వీటిలో కొన్నింటినైనా సాధించగల్గుతామని నమ్ముతున్నాను.

## ఎందరో మహానుభావులు.............

మా.వి.వే. కార్యక్రమాల్ని స్వేచ్ఛాలోచన పత్రిక అందించే చైతన్యాన్ని మెచ్చి ఎప్పటికప్పుడు ప్రోత్సాహాన్ని, ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న కొందరు హితైషుల్ని ఇక్కడ స్మరించుకుంటున్నాను. వారిలో చాలామంది ఈ సభలకు విచ్చేసారు. మా.వి.వేకు బయటవుంటూ లేదా వేరే సంఘాల్లో పనిచేస్తూ కూడా తమ వంతు సహకారాన్ని అందించే సహృదయులు కూడా వున్నారు. వారందరికీ ధన్యవాదాలు. మా.వి.వే. సాధిస్తున్న ప్రగతి, సుగతి ఏ కొంచమైనా వుందనుకుంటే అది సంస్థలో పనిచేసే నిజాయితీ, నిబద్ధత గల కార్యకర్తలదే. వారికి సహకరించే అభిమానులు, శ్రేయోభిలాషులదే. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

చివరగా ఇక విన్నపం. రాష్ట్రంలో పనిచేసే బావవిప్లవోద్యమ సంస్థల పట్ల మా.వి.వే.కి ఎప్పుడూ సాదరమైన సోదరభావమే వుంటుంది. ఏ సంస్థ ఏ కార్యక్రమం చేపట్టినా సహకరించడానికి మా.వి.వే. కార్యకర్తలు సిద్ధమే. ఇదే విధానం అన్ని సంస్థలూ కలిగివుండాలని కూడా మా.వి.వే. కోరుతుంది. భవిష్యత్తులో మా.వి.వే. చేపట్టే కార్యక్రమాలకు బలమైన భావవిప్లవోద్యమ సంస్థగా ఎదగడానికి మీరు ఎప్పటిలాగే చేయూత నివ్వాలని కోరుతున్నాను.

బి.సాంబశివరావు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మానవ వికాస వేదిక

10-01-2008